అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
బుధవారం 20 మే 2026

# బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో నాకాబందీ.



**బయ్యారం,మే 19.(జర్నలిస్ట్ వార్త)** జిల్లా ఎస్పి డా.శబరిష్ ఆదేశానుసారం మండలంలో అక్రమ రవాణాను అరికట్టడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి గార్ల బయ్యారం సీఐ ఆధ్వర్యంలో ఇల్లందు మహబూబాబాద్ హైవె రోడ్డుపై ఆకస్మిక తనిఖీలలో భాగంగా నాకాబందీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానిత వ్యక్తుల ద్విచక్ర వాహనాలు,కార్లు,ఇతర వాహనాలను ఆపి విస్తృతంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణ,దొంగతనాలు,చైన్ స్నాచింగ్‌లు, గంజాయి,ఇతర మత్తుపదార్థాల రవాణాను అడ్డుకోవడానికి నాకాబందీ నిర్వహింస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో ధ్రువపత్రాల పరిశీలన,డ్రైవింగ్ లైసెన్స్,వాహన రిజిస్ట్రేషన్,ఇన్సూరెన్స్ వంటి పత్రాలు సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.ఎస్ఐలు ప్రశాంత్ బాబు, సాయి కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంఘమిత్ర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి ఎన్నిక



**ఎల్కతుర్తి/, మే 19 (జర్నలిస్ట్ వార్త):** గోపాల్‌పూర్ గ్రామ సంఘమిత్ర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా కంచర్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా మాచర్ల మనోజ్ ఎన్నికైనట్లు సంఘ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డైరెక్టర్లు, సభ్యుల సూచనల మేరకు సంఘాన్ని ముందుకు తీసుకెళ్తూ సభ్యుల సంఖ్య పెంపుపై దృష్టి సారిస్తామని చెప్పారు. సభ్యుల అప్పులు, ఇతర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి సరైన విధానాలతో సంఘాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన డైరెక్టర్లు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షుడు మనోజ్ కూడా సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నూతన, మాజీ డైరెక్టర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

## ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన




**ఖమ్మం,/ మే 19 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని, హౌసింగ్ సొసైటీకి 23.2 ఎకరాల భూమిని వెంటనే అప్పగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మంలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి సభ నిర్వహించారు.
ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజేటీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం క్యాబినెట్‌లో జర్నలిస్టులకు 23.2 ఎకరాల భూమి కేటాయిస్తూ జీవో జారీ చేసినప్పటికీ, అమలులో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు.ఈ నెల 21న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల అంశంపై ఆమోదం తెలిపి హౌసింగ్ సొసైటీకి భూమి అప్పగించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ఆంక్షలు విధించే విధంగా చీకటి జీవోలు తీసుకురావడం సరైంది కాదన్నారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, మందుల ఉపేందర్, గుద్దేటి రమేష్‌బాబు, బిక్కి గోపి, అమరవరపు కోటేశ్వరరావు, నాగరాజు, కె. అశోక్, పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, మూల జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు

## : కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్ సిటీ, మే 19 (జర్నలిస్ట్ వార్త):**



బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి దించాలని, రాజీనామా చేయించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి అన్నారు. కానీ అది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయనను పదవిలో నుంచి దించేస్తే తాము వస్తామని కొందరు భావిస్తున్నారని ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కుమారుడు బండి భగీరథ్ తప్పు చేస్తే బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనడం సరికాదని అన్నారు.
బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా చట్టానికి లొంగిపోయేలా చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించారని కితాబిచ్చారు. మద్యం పాలసీ కేసులో కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు అన్నాక తప్పు చేస్తారని, కానీ దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా సరెండర్ చేశారని గుర్తు చేశారు.

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

### ఇందిరా మహిళా శక్తి టీ స్టాల్ ప్రారంభం -వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్







**పర్వతగిరి/మే 19 (జర్నలిస్ట్ వార్త):** మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వర్ధన్నపేట శాసనసభ్యులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజ్ అన్నారు. మంగళవారం పర్వతగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కాంప్లెక్స్ ఆవరణలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సరికొత్తగా ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. మదర్ థెరిస్సా మండల సమైక్య ఆర్థిక సహకారంతో, చౌటపెల్లి వసుంధర గ్రామైక్య సంఘం సభ్యురాలు గుర్రాల లావణ్య రూపాయలు 2 లక్షల వ్యయంతో ఈ 'ఇందిరా మహిళా శక్తి టీ స్టాల్'ను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, ప్రభుత్వ చేయూతతో వ్యాపార రంగంలోనూ రాణించి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

59 మందికి కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

టీ స్టాల్ ప్రారంభోత్సవం అనంతరం, ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజ్ పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, ఇల్లంద వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్కుడ వెంకటయ్య, తహశీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో



శంకర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు చీదురు శంకర్, మట్టపల్లి వెంకటేశ్వర్లు, తక్కలపల్లి శ్రీనివాస్, ఏపీఎం రాజీర్, ఎమ్ఎస్ ప్రతినిధులు స్వప్న, ఫరీదా, రజిత, సీసీలు గోలి కొమురయ్య, సుధాకర్, శ్యామ్, దేవేంద్ర, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కీర్తినగర్‌లో అక్రమ కెమికల్స్ తయారీ కేంద్రంపై దాడి

### భారీగా సామగ్రి స్వాధీనం

**గీసుగొండ/మే 19 (జర్నలిస్ట్ వార్త):** ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేకుండా అక్రమంగా యాసిడ్, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ తయారు చేస్తున్న ఒక కేంద్రంపై గీసుగొండ పోలీసులు దాడి చేసి భారీగా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గీసుగొండ సి ఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్‌కు చెందిన బాదం సతీష్ (60) కీర్తినగర్‌లోని శ్రీ సాయి ఇండస్ట్రీస్ బిలో ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్స్ తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ సింగారపు ప్రభాకర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం అక్కడ తనిఖీలు చేపట్టారు.




పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన యజమాని సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, హైదరాబాద్ నుండి ముడి సరుకులు తెప్పించి నిబంధనలకు విరుద్ధంగా కెమికల్స్ తయారు చేసి కిరాణా దుకాణాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు.
ఆ కేంద్రం నుండి సుమారు ₹1,28,340 విలువైన 1000 లీటర్ల ప్యూర్ యాసిడ్, 40 లీటర్ల ప్యూర్ ఫినాయిల్, 600 యాసిడ్ బాటిల్స్, 612 ఫినాయిల్ బాటిల్స్, 700 కిలోల లైమ్ స్టోన్ పౌడర్, భారీగా బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లు, వేల సంఖ్యలో ఖాళీ కవర్లు, లేబుళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డానియేల్ వర్ధంతి సందర్భంగా అన్నవితరణ




**మధిర, /మే 19 (జర్నలిస్ట్ వార్త):** మధిర పట్టణానికి చెందిన తుమ్మల డానియేల్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నవితరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో డానియేల్ సతీమణి తుమ్మల మరియమ్మ, కుమార్తెఅల్లుడు బట్టు మరియన్న, జ్ఞానరత్న కుమారి, మనుమలు, మనవరాళ్లు పాల్గొన్నారు. డానియేల్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు దేవుడు ఆదరణ కల్పించాలని కేంద్రంలోని నిర్వాహకులు, మానసిక దివ్యాంగ పిల్లల తరపున ప్రార్థనలు చేశారు.వర్ధంతి సందర్భంగా డానియేల్‌ను స్మరించుకుంటూ దివ్యాంగ పిల్లలతో కలిసి అన్నవితరణ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమం చేపట్టిన కుటుంబ సభ్యులకు కేంద్ర నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపు

**హైదరాబాద్ సిటీ, మే 19 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి గరిష్ఠ వయోపరిమితిని మరో పదేళ్ల పాటు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్లుగా ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇది ఇప్పుడు 44 ఏళ్లకు పెరిగింది. ఈ అదనపు వయో సడలింపు నిబంధన ఏడాది పాటు రానున్న అన్ని నోటిఫికేషన్లకు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగాల భర్తీలో జరిగిన ఆలస్యం, కరోనా మహమ్మారి, నోటిఫికేషన్లు రాకపోవడం వంటి కారణాల వల్ల ఎంతోమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి నష్టపోయారు

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి కొండంత అండ

## 59 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్



**పర్వతగిరి/మే 19 (జర్నలిస్ట్ వార్త):** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు. మంగళవారం పర్వతగిరి మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను 59 మంది లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. నిరుపేద కుటుంబాల్లో పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకాలను అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



# అరిస్తే కాదు.. భరిస్తేనే గెలుపు!

## సహనం, పట్టుదల, మంచితనమే విజయానికి అసలైన మార్గం





ఈ వేగవంతమైన ప్రపంచంలో ప్రతి మనిషి జీవితంతో పోరాడుతున్నాడు. ఉద్యోగం కోసం యువత, కుటుంబం కోసం పెద్దలు, భవిష్యత్తు కోసం విద్యార్థులు.. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒక లక్ష్యంతో పరుగులు పెడుతున్నారు. కానీ ఆశించిన ఫలితం వెంటనే రాకపోతే చాలామంది ఆవేశానికి గురవుతున్నారు. చిన్న సమస్యకే కోపం, నిరాశ, అసహనం పెరిగిపోతున్నాయి. అయితే జీవితంలో నిజంగా గెలిచిన వారి కథలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది.. అరిచినవారు కాదు, ఓపికతో భరించినవారే విజయ శిఖరాలను అధిరోహించారు.సహనం అనేది మనిషికి ఉన్న గొప్ప శక్తి. కోపంతో తీసుకున్న నిర్ణయం క్షణాల్లో జీవితాన్ని నాశనం చేయగలదు. కానీ ఓపికతో ఆలోచించిన మనిషి సమస్యల్లోనూ అవకాశాలను వెతుక్కోగలడు. జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టం మనిషిని మరింత బలంగా మార్చేందుకే వస్తుంది. కష్టాలను చూసి కుంగిపోవడం కాదు.. వాటిని ఎదుర్కొని నిలబడడమే అసలైన గెలుపు.నేటి సమాజంలో చాలా మంది అదృష్టాన్ని నమ్మి ఎదురు చూస్తుంటారు. కానీ అదృష్టం కంటే శ్రమ గొప్పది. కష్టపడి పనిచేసే వ్యక్తిని విజయం ఎప్పటికైనా వెతుక్కుంటూ వస్తుంది. రైతు పొలంలో చెమటోడ్చితేనే పంట పుడుతుంది. విద్యార్థి రాత్రింబవళ్లు చదివితేనే ఫలితం వస్తుంది. ఉద్యోగి నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుంది. ఏ రంగమైనా విజయానికి మూలం కష్టమే తప్ప అదృష్టం కాదు.అలాగే పట్టుదల ఉన్నవారికి అసాధ్యం అంటూ ఏదీ ఉండదు. ఒకసారి ఓడిపోయామని వెనక్కి తగ్గితే జీవితమే అక్కడితో ఆగిపోతుంది. విఫలం అనేది ఓటమి కాదు.. మరింత జాగ్రత్తగా ముందుకు వెళ్లమనే హెచ్చరిక మాత్రమే. చరిత్రలో గొప్ప వ్యక్తులంతా ఎన్నో అవమానాలు, అపజయాలు ఎదుర్కొన్నవారే. కానీ వారు ఓడిపోలేదు.. మళ్లీ లేచి నిలబడ్డారు. అందుకే ప్రపంచం వారిని గుర్తుంచుకుంది.మాటల కంటే పనులు ముఖ్యమని నేటి తరానికి మరింతగా అర్థమవ్వాలి. సోషల్ మీడియాలో గొప్ప మాటలు చెప్పడం సులువు. కానీ నిజ జీవితంలో కష్టపడటం, మన బాధ్యతలను నిర్వర్తించడం అంత సులువు కాదు. ప్రశాంతంగా పనిచేసే వ్యక్తి సమాజంలో గౌరవం పొందుతాడు. కోపం, అహంకారం మనిషిని ఒంటరివాడిని చేస్తాయి. మంచితనం, వినయం మాత్రం మనిషిని మరింత ఎత్తుకు తీసుకెళ్తాయి.ఇప్పటి యువతలో ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం కూడా ఆందోళనకర విషయం. చిన్న అపజయానికే జీవితాన్ని నిందించడం, నిరాశలోకి వెళ్లడం పెరుగుతోంది. కానీ "నేను చేయగలను" అనే నమ్మకం ఉంటే అసాధ్యం కూడా సాధ్యమవుతుంది. మనపై మనకు నమ్మకం ఉంటేనే ప్రపంచం మనల్ని నమ్ముతుంది.సమయం విలువను గుర్తించని వారు అవకాశాలను కోల్పోతారు. గడిచిపోయిన సమయం తిరిగి రాదు. కాబట్టి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణతో జీవించే వారే భవిష్యత్తును గెలుచుకుంటారు.చివరగా ఒక విషయం గుర్తుంచుకోవాలి.. జీవితంలో గెలుపు ఒక్కరోజులో రాదు. అది సహనం, పట్టుదల, క్రమశిక్షణ, మంచితనం, ఆత్మవిశ్వాసం కలయికతో వస్తుంది. కష్టాలు వచ్చినప్పుడు అరిచే వ్యక్తి కంటే.. ఓపికతో భరించి ముందుకు సాగే వ్యక్తే నిజమైన విజేత. ఎందుకంటే కాలం పరీక్షిస్తుంది.. కానీ సహనంతో నిలబడిన వారినే గెలిపిస్తుంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టె సుధాకర్ (లెనిన్)
జిల్లా కార్యవర్గ సభ్యులు
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్
(ఐజేయూ)హనుమకొండ జిల్లా
9908401581

# వానకాలం పంటలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

## రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ ప్రారంభం



**ఎల్కతుర్తి, మే 19 (జర్నలిస్టు వార్త):** వానకాలం పంటల సాగుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి మంద రాజ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రైతులకు పచ్చిరొట్టె, పిల్లిపిసరు, జీలుగు జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవచ్చన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, సహకార సంఘం చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ చేతుల మీదుగా జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, సభ్యులు, ఏఈవోలు ఎం. పున్నం చందర్, టి. కమలాకర్, తాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

## మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సందర్శన





**ఎల్కతుర్తి, /మే 19 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ స్కూల్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ నాయకులను కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మంగళవారం పరామర్శించారు.అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో మాజీ ఎంపీపీ తంగేడ శాలిని భర్త మహేందర్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు గొల్లె మాధవి భర్త మహేందర్ గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వినోద్ కుమార్ వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు యేల్తూరి స్వామి, పోరెడ్డి రవీందర్ రెడ్డి, కడారి రాజు, కుర్ర సాంబమూర్తి గౌడ్, ఎర్రబెల్లి సంపత్‌రావు, వేముల శ్రీనివాస్, వేముల సమ్మయ్య, మేకల సుదర్శన్, మేకల బాబురావు తదితరులు పాల్గొన్నారు

# నర్సంపేట యాదగిరిగుట్టకు బస్సు సర్వీస్

## ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త



**నర్సంపేట/, మే 19 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నర్సంపేట డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి తెలిపారు.

ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు నర్సంపేట డిపో నుంచి బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. నర్సంపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# పాల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



**తల్లాడ/, మే 19 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం మంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. వైరా నుంచి ఇంటికి వస్తున్న రెడ్డిగూడెం గ్రామానికి చెందిన తంబళ్ల రాంబాబు (38) ప్రయాణిస్తున్న బైక్‌ను జెర్సీ పాల ఫ్యాక్టరీకి చెందిన వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు.ఘటనపై సమాచారం అందుకున్న తల్లాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వీవోఏల సమ్మెకు పిలుపు

## ఎంపీడీవోకు వినతిపత్రం



**తల్లాడ/, మే 19 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రవ్యాప్తంగా వీవోఏల సమ్మెకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో తల్లాడ మండలంలో ఐకేపీ (సెర్ప్) జేఏసీ వీవోఏలు సోమవారం సమావేశమయ్యారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా వీవోఏలు శాంతియుతంగా నిరవధిక సమ్మెలో పాల్గొంటారని తెలిపారు.సమ్మె కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డి.సుజాత, భానుశ్రీ, కళావతి, విజయలక్ష్మి, ప్రసన్న, వెంకటలక్ష్మి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

# నెలలుగా కదలని మక్కలు.. రైతుల ఆవేదన

## కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న దిగుబడి

## ప్రత్యేక అధికారులు చొరవ చూపాలని డిమాండ్





**ఎల్కతుర్తి,/ మే 19 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ది విశాల సహకార బ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి మక్కలు నిల్వ ఉండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2200 మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు మక్కలను లోడ్ చేసి తరలించకపోవడంపై రైతులు అధికార యంత్రాంగంపై మండిపడుతున్నారు.వివిధ గ్రామాల రైతులు పండించిన మక్కలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిల్వ ఉంచినా కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దే రోజుల తరబడి గడపాల్సి వస్తోందని, నిద్రాహారాలు మానుకుని కాపలా కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా రైతు నాయకుడు చిట్యాల బాబు మాట్లాడుతూ.. "రైతే రాజు" అని చెప్పే ప్రభుత్వాలు రైతుల కష్టాలను గుర్తించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మక్కలను నెలల తరబడి సొసైటీల్లో నిల్వ ఉంచడం సరైంది కాదన్నారు. వేలాది క్వింటాళ్ల మక్కలు కొనుగోలు కోసం ఎదురు చూస్తుండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

పండించిన పంటలను పారదర్శకంగా కొనుగోలు చేసి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారులు చొరవ చూపి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఉద్యోగిపై దౌర్జన్యం ఆరోపణ

## ఎల్కతుర్తిలో పోలీసులకు ఫిర్యాదు



**ఎల్కతుర్తి,/ మే 19 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సునీల్‌పై ఇద్దరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారనే ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీడీవో కార్యాలయంలో కోతులనడుమ గ్రామపంచాయతీకి సంబంధించిన పనులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన వినయ్, హనుమకొండకు చెందిన ధీరజ్ అక్కడికి వచ్చి ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయలేదని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారని తెలిపారు. అనంతరం కాలర్ పట్టుకొని చెంపపై కొట్టడంతో పాటు చొక్కా పట్టుకొని లాగుతూ విధులకు ఆటంకం కలిగించారని ఆరోపించారు.అక్కడే ఉన్న అధికారులు ప్రశ్నించినప్పటికీ వారు వినకుండా దురుసుగా మాట్లాడారని సునీల్ వాపోయారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# ఆధార్‌తో పేర్లు నమోదు చేసుకోవాలి

## పెన్షన్ లబ్ధిదారులకు తల్లాడ పంచాయతీ కార్యదర్శి సూచన





**తల్లాడ/, మే 19 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆసరా, వికలాంగుల పెన్షన్ లబ్ధిదారులు తమ ఆధార్ కార్డులతో గ్రామపంచాయతీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఆర్. శ్రీహరికృష్ణ సూచించారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు పొందుతున్న వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.గ్రామపంచాయతీ కార్యాలయానికి రాలేని లబ్ధిదారులు సమాచారం అందిస్తే వారి ఇంటి వద్దకే వెళ్లి నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆధార్ వెరిఫికేషన్ చేయించుకోని వారి పెన్షన్లు నిలిపివేయబడే అవకాశం ఉందని హెచ్చరించారు. పెన్షన్ దారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

